క్లుప్తంగా

బియ్యం బస్తాల వితరణ



నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెం అయ్యప్పగుడి సమీపంలోని ప్రగతి చారిటీస్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బియ్యం బస్తాలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం బిస్కెట్లు, పండ్లు అందించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వయో వృద్ధులు, దివ్యాంగులు, నిరాదరణ కేంద్రాలకు బియ్యం బస్తాలను పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ తెలిపారు. పెనాక సుజాతరెడ్డి, ఎస్.మాధవి, డాక్టర్ మారం సుధాకర్, పద్మ, లీనా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమం, గీతామయి బాలభవన్ తదితర ప్రాంతాల్లో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పరిశుభ్రతా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. రోడ్ల వెంబడి ఉన్న చెత్తను శుభ్రం చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, మోటివేటర్ వెంకటేశ్వర్లు, అపర్ణ పాల్గొన్నారు.

ఐక్యంగా సాధించుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : గౌడ కులస్తులు ఐక్యంగా ఉండి మద్యం దుకాణాలను సాధించుకోవాలని గౌడ ఐక్యవేదిక నేత బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్ కోరారు. నగరంలోని గౌడ సంఘ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా తమకు కేటాయించిన దుకాణాలు తమకే వచ్చేలా మంత్రులు, ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. కొన్నిచోట్ల రాజకీయ నాయకులు తమవారిని బెదిరిస్తున్నారని, అలాంటివి లేకుండా చూడాలన్నారు. గౌడ సంఘం రాష్ట్ర నేత అన్నం దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో గౌడ కులస్తులను ఎమ్మెల్యేలు భయాందోళనలకు గురి చేస్తున్నారని, ఇలాంటి వాటికి భయపడకుండా గౌడ కులస్తులందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. సమావేశంలో గౌడ సంఘం జిల్లా కార్యదర్శి ముత్యంగౌడ్, సంఘ నేత వెంపులూరు భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఉద్యోగోన్నతి



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో పారిశుద్ధ్య వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి మేస్త్రీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ సూర్యతేజ గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఎన్‌ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో వారంతా ఉద్యోగోన్నతి ఉత్తర్వులను అందుకున్నారు. అలాగే మేస్త్రీగా విధులు నిర్వహిస్తున్న జి.డేనియల్‌ను హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులు అందించారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో బి.చిన్నపాపయ్య, భాస్కరయ్య, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, బహదూర్ ఖత్రి, జీవరత్నం, రాఘవులు ఉన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ : మద్యం సేవించి తనపై దాడి చేశారని భర్తపై భార్య రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తోటపల్లిగూడూరు చిన్నతోపునకు చెందిన బాలాజీ 2021లో మూడో మైల్‌లో నివాసం ఉంటున్న వర్షితను వివాహం చేసుకున్నారు. నాలుగు రోజుల క్రితం బాలాజీ తన భార్యను మూడో మైల్‌లోని ఆమె పుట్టింటిలో వదిలిపెట్టారు. మద్యం సేవించి గురువారం వారి ఇంటికి వెళ్లి గొడవకు దిగారు. ఈ క్రమంలో భార్య, కుటుంబ సభ్యులపై దాడి దిగాడు. ఈ మేరకు బాధితురాలు వర్షిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మద్దులూరు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఏపీ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మద్దులూరు సుభాష్ యాదవ్‌ను నియమించారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర బీసీ కుల సంఘాల ఆత్మీయ సమావేశంలో పోతిరెడ్డిపాళెనికి చెందిన మద్దులూరు సుభాష్‌యాదవ్‌ను యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సత్యనారాయణపురం, బోడిగాడితోట, శ్రీనివాసనగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, మైపాడురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డెక్కిన నిర్లక్ష్యం

నగరంలో డ్రైయినేజీ వ్యవస్థతో పాటు తాగునీటి నిర్వహణ సరిగ్గా చేపట్టకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఫలితంగా ఎక్కడికక్కడ దోమల ఉధృతి తీవ్రంగా ఉంది. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

- అస్తవ్యస్తంగా తాగునీరు, డ్రైయినేజీ వ్యవస్థలు
- నిర్వహణను పట్టించుకోని అధికార యంత్రాంగం

టిడ్కో సముదాయాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై నిలిచిన తాగునీరు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీ టిడ్కో గృహ సముదాయాల్లో కనీస వసతులు సక్రమంగా ఉండడం లేదు. ఇక్కడ డ్రైయినేజీ నీటితో పాటు తాగునీరు సైతం రోడ్లపై ప్రవహిస్తోంది. టిడ్కో గృహ సముదాయంలో అపార్ట్‌మెంట్లపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు తరచూ నిండిపోతున్నాయి. ఫలితంగా నీరు రోడ్డుపై చేరి చెరువులను తలపిస్తున్నాయి. చివరకు డ్రైయినేజీ నీరు కూడా బయటకు వెళ్లే మార్గం లేక సంపులు నిండి రోడ్లపై ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని టిడ్కో ప్రాంత వాసులు వాపోతున్నారు. గతంలో అపార్టుమెంట్ల వద్ద నీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది చిన్న పిల్లలు అనారోగ్యాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన డ్రైయినేజీ నీరు

అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన డ్రైయినేజీ నీరు

వర్షం పడలేదు, వరదలు రాలేదు. కానీ నగరంలో డ్రైయినేజీ నీరు మాత్రం నిలిచిపోయి రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జి వద్ద డ్రైనేజీ నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో నిండిన నీటిలో వాహనదారులు అగచాట్లు పడుతున్నారు.



టిడ్కో సముదాయాల్లో వృథాగా పోతున్న తాగునీరు

కుష్టు నివారణకు కృషి

నెల్లూరు(అర్బన్) : కుష్టు రోగులను గాంధీ అందించిన సేవల స్ఫూర్తితో స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ద్వారా కుష్టు నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత అన్నారు. స్థానిక దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రిలో కుష్టురోగులకు వైద్యసేవలందిస్తున్న టీహెచ్ వార్డులో గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ 'స్పర్శ' కార్యక్రమం ద్వారా ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టునివారణపై వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గాంధీ స్ఫూర్తితో కుష్టు రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీఎస్‌ఎంఓ డాక్టర్ సురేంద్ర, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, డీఎఫ్ఐటీ కో-ఆర్డినేటర్ సతీష్, ఫిజియోథెరపిస్ట్ నారాయణ, పీఎంఓ మల్లమ్మ, డీపీఎంఓలు సుబ్బయ్య, ఆచారి, రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ, వైద్యాధికారులు

సహకార సిబ్బందికి శిక్షణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీసీ బ్యాంకులో సహకార కార్యాలయ సిబ్బందికి గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిన సందర్భాల్లో చేపట్టాల్సిన దర్యాప్తు, రికవరీ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, డీసీసీ బ్యాంక్ సీఈఓ శ్రీనివాసరావు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నేతల బైక్ ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నేతలు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని 53, 54 డివిజన్ల పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీ, మసీదు సెంటర్, లక్ష్మీపార్వతి నగర్, టిడ్కో అపార్ట్‌మెంట్లు, వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజన కాలనీ, పునరావాస కాలనీ ప్రాంతాల్లో పర్యటించి అవగాహన కల్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, శాఖా కార్యదర్శులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, జాఫర్, కరీముల్లా, బయ్యన్న, వెంకటేశ్వర్లు, సమీవుల్లా, అల్లాభక్షు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు ఆదాల విరాళం

నెల్లూరు (బారకాసు) : వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఆదాల వింధ్యావలి జన్మదినం సందర్భంగా బాలాజీనగర్‌లోని గీతామాయి వృద్ధుల ఆశ్రమ నిర్వహణ కోసం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. అలాగే అయ్యప్పగుడి సమీపంలోని ప్రగతి చారిటీస్ నిర్వహణకు రూ.50 వేలను అందించారు. దీనిని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, పాశం శ్రీనివాస్, సీహెచ్ హరిబాబు యాదవ్, రవీంద్ర, స్వర్ణ జీవన్‌ప్రసాద్, బెల్లంకొండ వెంకయ్య, నాని పాల్గొన్నారు.



వృద్ధాశ్రమానికి విరాళం అందజేత

గాంధీ మార్గంలో పయనించాలి



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



గాంధీ బొమ్మ సెంటర్‌లో..



డీసీఓ కార్యాలయంలో..



రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్‌లో..

నెల్లూరురూరల్ : శాంతీయుత మార్గంలో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడు గాంధీ అని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి గురువారం ఉదయం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాతిపిత అనుసరించిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ విజయ్‌కుమార్, డీడీ సదారావు, సిబ్బంది ఉన్నారు.

జెడ్పీలో..

నెల్లూరు (పొగతోట) : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని జెడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యం ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనకట్ల రఘురాం ముదిరాజ్, నలుబోలు బలరామయ్య నాయుడు, దద్దోలు రమణయ్యగౌడ్, అరిగేల సాయిరాం, యస్దాని, భాగవతుల విజయ రాఘవేంద్ర, దాసు, రాంబాబు, చిన్నా పాల్గొన్నారు.

➡ ఏసీ స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. అదే విధంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని జరిపారు. కార్యక్రమంలో గువ్వల నారాయణరెడ్డి, సెక్రటరీ మాగంటి ప్రసాద్, ట్రెజరర్ నలుబోలు బలరామయ్య నాయుడు పాల్గొన్నారు.

➡ వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ స్టేడియంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, ట్రెజరర్ గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు మేకల నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు(బృందావనం) : ట్రంకురోడ్డులో గాంధీ విగ్రహానికి వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ సిటీ నిర్వాహకులు పాదర్తి బాలాజీ, వేమూరు గిరీష్‌కుమార్, కొండపల్లి రమేష్, ఎస్.మోహన్‌సాయి, పాదర్తి సాయిబాబా, పి.బాలసుబ్రహ్మణ్యం, ఆర్.వెంకటరమేష్‌బాబు, సాయిరాం, పరిటాల పాండురంగ పాల్గొన్నారు.

➡ నెల్లూరు (వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి డీసీఓ గుర్రప్ప నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు రసూల్‌ఖాన్, విజయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

➡ నెల్లూరు(అర్బన్) : నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ -ఎంఎ స్వార్ స్పాస్టిక్ సెంటర్‌లో గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సెక్రటరీ మస్తానయ్య, మేనేజింగ్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు మానసిక దివ్యాంగుల విద్యార్థులతో కలిసి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో..



వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో..



ట్రంకురోడ్డులో..

మహాత్ముని అడుగుజాడల్లో నడుద్దాం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాకాణి, పర్వతరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : జాతిపిత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడుద్దామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని డైకస్ రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గాంధీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిటీ కార్యాలయంలో..

రామ్‌జీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. తొలుత బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



టెలిస్కోప్ ద్వారా అంతరిక్షాన్ని వీక్షిస్తున్న మహిళ

నెల్లూరు(బృందావనం) : పుస్తకానికి మరణం లేదని, ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరుగుతున్న సింహపురి పుస్తక మహోత్సవంలో గురువారం రాత్రి నిర్వహించిన పుస్తక పరిచయ గోష్ఠి కార్యక్రమంలో 'నేను చదివిన పుస్తకం' అనే అంశంపై సాహితీవేత్తలు, కవులు, రచయితలు వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ పాఠ్యాంశాల పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను చదవడం ద్వారా గొప్ప మేధస్సు వస్తుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కె.లక్ష్మయ్యతో పాటు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి, గంగిశెట్టి శివకుమార్, గోవిందరాజుసుభద్రాదేవి, మెట్టు రామచంద్రప్రసాద్, డాక్టర్ కాలేషా, ఇంద్రగంటి మధు, మాల్యాద్రి, చిన్ని నారాయణరావు తదితరులు తాము చదివిన పుస్తకాల గురించి వివరించారు.

అంతరిక్ష వీక్షణం

పుస్తక ప్రదర్శనలో భాగంగా వచ్చిన ప్రజలు జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెలిస్కోప్ ద్వారా అంతరిక్షాన్ని వీక్షించారు. నిర్వాహకులు వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఆదర్శంగా నిర్వహించండి

నెల్లూరు(బారకాసు) : ఉమ్మడి జిల్లా పరిధిలోని కావలి, ఆత్మకూరు, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, కందుకూరు మున్సిపాలిటీల్లో అన్న క్యాంటీన్లను ఆదర్శంగా నిర్వహించాలని ఆయా మున్సిపల్ కమిషనర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో అన్న క్యాంటీన్ల స్పెషల్ అధికారులు, ఆయా మున్సిపల్ కమిషనర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ నందన్, స్పెషల్ అధికారులు చెన్నుడు, వేణు, రహంతుజానీ, శేషగిరిరావు, క్యాంటీన్ల నిర్వాహకులు గణేష్, అనిల్, సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

పర్యవేక్షించండి

ఎన్ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లలో వీధి దీపాలను అమర్చి పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. బుజబుజ నెల్లూరు పరిసర ప్రాంతాల్లో గురువారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వీధుల్లో క్రమం తప్పకుండా కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత చేపట్టాలన్నారు. వార్డు సచివాలయ భవనాలకు తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డైకాస్‌రోడ్డు, వెంగళ్‌రావునగర్‌లోని అన్నక్యాంటీన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఈ శేషగిరిరావు, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మదన్‌మోహన్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం) : శ్రవణా నక్షత్రం సందర్భంగా బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వైఖానస ఆగమనంగా నిర్వహించిన కల్యాణోత్సవాన్ని భక్తులు విశేషంగా తిలకించారు. సర్వాలంకారశోభితంగా కొలువైన స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కొప్పరపు వెంకట్, కోట మురళీకృష్ణ వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పరపు శివప్రసాద్, స్వామి హనుమంతరావు పర్యవేక్షించారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



విలువైన స్థలం కాజేసే యత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

నెల్లూరు(బారకాసు) : నగరంలో ఓ విలువైన స్థలాన్ని టీడీపీ నేతలతో సన్నిహితంగా ఉంటున్న ఓ వ్యక్తి కాజేసే యత్నం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యప్పగుడి సమీపంలో టీచర్స్ కాలనీ ఐదో వీధిలో కౌసర్ పర్వీన్, ఖాజామొహిద్దీన్ దంపతులకు ఓ ఇల్లు, కొంత స్థలం ఉంది. ఈ నేపథ్యంలో దూరపు బంధువులైన షర్మిల, ఆమె భర్త జహీర్‌బాషా నుంచి అవసరాల నిమిత్తం డబ్బు తీసుకుని ఇంటికి సంబంధించిన పత్రాలను తనఖాగా ఉంచారు. కాగా కొద్దికాలం తర్వాత యజమానులు ఆ ఇంటిని కూలదోసి చదును చేసుకున్నారు. తీసుకున్న అప్పు చెల్లించినా ఇంటి పత్రాలు ఇవ్వకపోవడంతో కౌసర్ పర్వీన్ దంపతులు కోర్టును ఆశ్రయించారు. ఇలా ఉండగా షర్మిల భర్త జహీర్‌బాషా టీడీపీ నేతలతో సన్నిహితంగా ఉంటూ మా స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నట్లు బాధితులు సాక్షితో వాపోయారు. జేసీబీని తీసుకొచ్చి ఖాళీ స్థలంలోని మొక్కలు, చెట్లను కూలదోసి చదును చేసి మట్టిని తొలగించాడని తెలిపారు. జహీర్‌బాషాపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.



ఆక్రమించేందుకు చదును చేసిన స్థలం